కథానిక

# "విమర్శకులు"

అబ్బూరి ఛాయాదేవి

ఆనాడు విమల చేసిన పనిని క్లాస్‌మేట్స్ ముగ్గురూ విమర్శించారు. "చదువుకున్న స్త్రీ చెయ్యవలసిన పని అదేనా!" అన్నారు. విమలకి బొత్తిగా ప్రపంచజ్ఞానం లేదన్నారు. విమలగాని, రామారావుగాని బి. ఏ. అయినా పూర్తిచేయ లేదు. ఈలోపలే అంత తొందరపడి యిద్దరూ పెళ్ళిచేసుకోవలసిన అగత్యం ఏమిటో క్లాస్‌మేట్స్ ముగ్గురికీ అర్థంకాలేదు. పైగా ఆ పెళ్ళ యినా లోకవిరుద్ధంగా వుంది. విమల కలవారి కూతురు. సంప్రదాయికమయిన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. రామారావు తండ్రి కోమటి కొట్టులో గుమాస్తా. స్కాలర్‌షిప్‌తో చదువుకుంటున్నాడు-రామారావు. ఇటు విమల, అటు రామారావుకూడా తల్లిదండ్రుల మాటల్ని పెడచెవిని పెట్టి చాటుకుండా వెళ్ళిపోయి అన్నవరంలో పెళ్ళిచేసుకున్నారు. రామారావులో ఏంచూసి విమల వలచి వివాహంచేసుకుందో క్లాస్‌మేట్స్‌కి అర్థంకాలేదు. రామారావుకి అందమైన లక్షణాలు ఏమీలేవు. మనిషి బక్కపలచగా ఉంటాడు: చామన ఛాయ, నుదురు కొంచెం చిన్నది, దుబ్బుజుట్టు పోనీ తెలివైనవాడా అనుకుంటే అదీ అంత కనిపించదు- ఏదో బట్టీపట్టి మార్కులు తెచ్చుకోవడంతప్ప. మరి అతనిలో ఏం గొప్పతనం ఉందని విమల అతన్ని వివాహంచేసుకుంది? తల్లిదండ్రుల నెదిరించి వెళ్ళిపోయారుకదా, వాళ్లు తమ భావి జీవితాన్ని గురించి ఆలోచించే ఆ పని చేశారా? .వాళ్లు ఏవిధంగా పొట్టపోషించుకుంటారు? ఎలా బ్రతుకుతుంది విమల ఆ అప్రయోజకుడితో?... ఈవిధంగా కాస్త టైముదొరికినప్పుడల్లా క్లాస్‌మేట్స్ ముగ్గురూ విమలని విమర్శించారు.

విమల తండ్రి విమలనీ రామారావునీ ఇంటికి రప్పించి ఆదరించాడని వినేసరికి క్లాస్‌మేట్స్ ముగ్గురికీ ఆశ్చర్యంవేసింది. "ఒక్కగాని ఒక్క కూతురు—ఇంక మొగపిల్లలయినా లేరు— ఏం చేస్తాడు ఆదరించక! నలుగురిలోనూ అల్లరిపడట మెందుకని ఇద్దరినీ ఇంట్లోపెట్టుకుని వుంటాడు" అంది కమల.

"అదే మా నాన్నగారైతే ఎంత ఏకైకపుత్రిక అయినా అటువంటి పనిచేస్తే సహించరు. ఆయన్ని ఎదిరించి ఏపనైనా చేస్తే ఇంట్లోంచి గెంటేస్తారు. మళ్ళీ గుమ్మంలో అడుగుపెట్టనివ్వరు" అంది శ్యామల.

ప్రమీలకి పెళ్ళంటే అసహ్యం. ఎవరైనా వేళాకోళానికి పెళ్ళి ప్రసక్తి తెచ్చినా కస్సుమంటూ లేస్తుంది. అందువల్ల ఒకవిధంగా విమలని ఏవగించుకుంది. "ఇక జీవితంలో విమల సాధించ గలిగేదేముంది? పట్టుమని పద్ధెనిమిదేళ్ళయినా నిండకుండా పెళ్ళిచేసేసుకుంది. ఇంకోసంవత్సరంపోతే పిల్లలు ప్రారంభం! ఇక జీవితంలో తను ఏ సుఖాన్ని అనుభవిస్తుంది? అలా బుద్ధితక్కువగా ప్రవర్తించే వాళ్ళని చూస్తే నవ్వాలో ఏడవాలో నాకర్థం కాదు" అంది ప్రమీల. అసలు ఎవరి పెళ్ళిప్రస్తావన వచ్చినా అలాగే మాట్లాడుతుంది ప్రమీల.

శ్యామలకి పెళ్ళిసంబంధం నిశ్చయమైనప్పుడు శ్యామలని అలాగే నిరుత్సాహపరిచింది. శ్యామలకి తల్లిదండ్రులే సంబంధం నిశ్చయించారు. కుర్రవాడు క్రొత్తగా ప్లీడరీ ప్రాక్టీసుపెట్టాడు. ఎస్టాబ్లిష్‌మెంటుకి బోలెడు ఖర్చయివుంటుంది. కొన్నాళ్ళదాకా అట్టే రాబడి ఉండదుకదా!

అధమం అయిదువేలన్నా కట్నంరూపంలో ఇస్తేగాని ఒప్పుకోనన్నాడుట. తండ్రి తహసిల్దారీ చేసి రిటైరైనాడు. ఏదో సంప్రదాయకమయిన కుటుంబం, ఇంతకంటె మంచి సంబంధం మళ్ళీ దొరుకుతుందో దొరకదో... కట్నం పుచ్చుకోకుండా ఈ రోజుల్లోపుస్తికట్టేదెవరు? అనుకుని తండ్రి పొలం అమ్మడానికి సిద్ధపడి సంబంధం నిశ్చయించాడు. శ్యామలకి మనసులో బాధగానే

వుంది- తన పెళ్ళికోసం తండ్రి ఆస్తినమ్ముకోవలసి వచ్చిందని. ఇంకా తనతరవాత తమ్ముడున్నాడు. వాడింకా స్కూల్ ఫైనల్ లో ఉన్నాడు. వాడి చదువుకి బోలెడు ఖర్చవుతుంది, ఎమిటో! అన్నీ అలాగే ఉన్నాయి- తనేంచెయ్యగలదు? పోనీ, ఉద్యోగం చేద్దామా అంటే తండ్రి ఒప్పుకోడు. ఆ చదువైనా చదివించకపోతే వరుడు దొరకడేమోననే చదివిస్తున్నారు. తండ్రిమాట అటుంచి అసలు తనకీ అంత ఇష్టంలేదు ఉద్యోగంచెయ్యడం. ఎప్పటికైనా స్త్రీ పెళ్ళిచేసుకోవలసిందేకదా, ఆ చేసుకునేదేదో యుక్తవయస్సులోనే చేసుకుంటే బాగుంటుందనుకుంటుంది శ్యామల. కట్నం పుచ్చుకున్నవాణ్ణిచేసుకోనని మొండిపట్టుపట్టి కూర్చుంటే అసలు పెళ్లేకాదేమోనని భయం. తను అంత అందకత్తెకూడా కాదాయను. తన కాళ్లదగ్గరికొచ్చి పెళ్లి చేసుకుంటాననే మహానుభావు డెవడుంటాడు?

ఇక గతిలేక ఆ అయిదువేలు కట్నంకోరే క్రొత్తప్లీడరునే ఒప్పుకొంది శ్యామల.

ప్రమీల తిట్టింది-అనుకున్నట్టుగాను "నీకేం కర్మంకాలిందని అయిదువేలు కట్నం ఇస్తూ ఆ కుర్రవాణ్ని పెళ్ళిచేసుకోమని ప్రాధేయ పడటానికి? అయినా, నేనొకటి అడుగుతాను— చెప్పు-అసలు నీకిప్పుడు పెళ్ళికి తొందరేం వచ్చింది? ఇంకా మైనారిటీ అయినా తీరలేదు కదా! ఇప్పటివరకూ మీనాన్నమీద ఆధారపడ్డావు. ప్రతీదానికీ నాన్నగారు ఏమంటారోనని భయం. ఇక పెళ్ళయాక భర్త-భర్తఏమంటాడోనని భయం. ఇక నీకు స్వతంత్రం ఎక్కడుందే జీవితంలో? నీ కిష్టంవచ్చిన చీరకొనుక్కునేందుకు కూడా నీ కధికారం లేనప్పుడు- బ్రతికి ఏం లాభం? ఇటువంటి బానిసబ్రతుకు బ్రతికేకన్న చస్తేనయం!" అంది ప్రమీల సీరియస్ గా. శ్యామల చిన్నబుచ్చుకుంది. తనకిసంబంధం కుదిరిందంటే అభినందిస్తుందనుకుంది. కమలేనయం-సభ్యతకోసమయినా అభినందించింది.

"ఏం? వైవాహిక జీవితంలో సౌఖ్యం, ఆనందం లేదంటావా?" అంది శ్యామల మెల్లిగా. ఇటువంటి ప్రశ్నలేవైనా ఎవరైనా అడిగితే ప్రమీలకి భలే ఉత్సాహం వస్తుంది. వాదించడం ప్రమీలకి సరదా. "ఆనందమా? అవగింజంతకూడా లభించదు సంసారంలో" అంది ప్రమీల అనుభవం ఉన్నదానిలాగ.

"నువ్వు చదువుకున్నదానివేగాని ప్రపంచజ్ఞానం శూన్యం. నేను లక్షసంసారాలు చూశాను. కొత్తగా పెళ్ళిచేసుకున్నవాళ్లని చూశాను— ప్రేమించి పెళ్ళిచేసుకున్నవాళ్లని చూశాను... వృద్ధదంపతుల్ని చూశాను. అనేకరకాల సంసారాలను స్టడీచేశాను. అందులో ఏ ఒక్కరూకూడా సంసారంలో సుఖంఉందన్నముక్క అనలేదు... మా అమ్మ, నాన్నగారు ఎప్పుడూ తగువులాడుకుంటూనేవుంటారు. "ముప్పయిఏళ్లనుంచి కాపురం చేస్తున్నా తన్ను అర్థంచేసుకోలేదు. నేను కాబట్టి నీతోసంసారం చేస్తున్నాను. అదేమరొకరైతే పెళ్ళయిన మర్నాడే కాషాయివస్త్రాలు ధరించి కాశీయాత్రకి బయిలుదేరేవాడు" అంటారు నాన్నగారు.

"ఇంకా చెప్పొచ్చారు—పెట్టిన హింసలన్నీ నేను కాబట్టి భరించాను. మరొకత్తె అయితే ఏనాడో ఉరిపోసుకోవడయో, ఏ గంగలోనైనా దూకడమో జరిగేది"-అంటుంది అమ్మ. నిజంగా వాళ్లు తమవైవాహికజీవితంలో సుఖాన్ని పొందగలిగివుంటేవాళ్ళామాటలంటారా! ఏంశ్యామలా?

శ్యామలకి వాదించడం చేతకాదు—తనలో తాను వితర్కించుకోవడంతప్ప. ప్రమీల మాటల్ని అర్థంచేసుకుందుకు ప్రత్నిస్తోంది. ప్రమీలమాటల్లో కొంత నిజంలేకపోలేదనుకుంది. తనతల్లీ, తండ్రీ కూడా అలా ఒకరినొకరు దెప్పుకుంటూనే వుంటారు. అయితే. అమ్మా నాన్నా పైడాబా మీద వెన్నెట్లో కూర్చుని ముచ్చటగా కబుర్లు చెప్పుకుంటూ ఒకరినొకరు వేళాకోళం చేసుకుంటూ సరదాగా కాలంగడపిన రోజులూజ్ఞప్తికి వచ్చినై. ప్రమీలమరీ పిచ్చిదానిలామాట్లాడుతుంది. మొండిగా వాదిస్తుంది. అసలు సంసారంలో సుఖమే లేవంటుంది. యౌవనంలో వున్న దంపతులు కులాసాగా చెయ్యీ చెయ్యీ కలుపుకుని బీచ్ కి షికారుగా వచ్చినప్పుడు తను ఎన్నోసార్లు అనుకున్నది—వాళ్ళు ఎంత హాయిగా వుంటున్నారోనని. పెళ్ళయితే స్త్రీ భర్తకి బానిస అయిపోతుందంటుంది ప్రమీల. 'బానిస' అనే భావం ఎందుకు కలగాలి? వదిన ఎప్పుడూ అన్న

య్యకి ఇష్టమయిన పనులే చేస్తూవుంటుంది. అన్నయ్యకి ఉల్లిపాయలంటే అసహ్యం. అంచేత వాడు అడక్కుండానే ఉల్లిపాయలు తన కెంతో ఇష్టమయినా తినడం మానేసింది. అంత మాత్రం చేత పెళ్ళి చేసుకున్నందుకు పడిన పశ్చాత్తాప పడలే దెప్పుడూ. భర్తకి ఇష్టమయిన పనులు చెయ్యడంలోనే ఆనందం ఉందనుకుంటుంది స్త్రీ అనుకుంది శ్యామల. అయితే ప్రమీల అందుకు వొప్పుకోదు.

ప్రమీల ఎప్పుడూ వాళ్లక్కయ్య గురించి చెపుతూ వుంటుంది. వాళ్లక్కయ్యకి చదువు చెప్పించలేదుట వాళ్ల నాన్న గారు. సంగీతం మాత్రం చెప్పించారుట. వాళ్ళక్కకి బోలెడు సంబంధాలు వచ్చాయట. వచ్చినవాళ్ళంతా అక్కయ్య చేత పాడించేవారుట. ప్రతీవాడూ పిల్ల నల్లగా ఉందనో, అమ్మాయి చదువుకోలేదనో, అంత సొగసరి కాదనో—ఇలా ఏదో వంక పెట్టి వెళిపోయేవాడుట. వచ్చినవాళ్లు వంకలు పెట్టి వెళ్ళగానే అక్కయ్య కళ్ల నీళ్ళు పెట్టుకునేదిట. చివరికి నాలుగువేలు కట్నం యిచ్చి, ఒక గ్రాడ్యుయేట్ కిచ్చి పెళ్ళి చేశారుట. ఆ అబ్బాయి తల్లితండ్రుల మాట కాదనలేక పెళ్ళికి ఒప్పుకున్నాడుట. పెళ్ళైన నాటినుంచీ ఎడ మొహం, పెడ మొహమూను. పెళ్ళాన్ని ఆ విధంగా ఏడిపించడానికి ధైర్యసాహసాలున్న మనిషి ముందే తన తల్లితండ్రులతో తన కా పెళ్ళి అక్కర్లేదని చెప్పకూడదూ? వద్దంటూంటే పెళ్ళి చేసిన ఆ తల్లితండ్రులనీ, తన కిష్టంలేకుండా తల్లి తండ్రులకోసం పెళ్ళి చేసుకుని, తర్వాత భార్యని బాధ పెడుతున్న తన బావకీకూడా బుద్ధిలేదంటుంది ప్రమీల. వాళ్ళక్కయ్య ప్రమీలతో ఎన్నోసార్లు చెప్పిందిట—"శుభ్రంగా చదువుకుని ఉద్యోగం చేసుకుంటూ స్వతంత్రంగా బ్రతుకు... పెళ్లిచేసుకోకు" అని. ఇప్పుడు వాళ్ల నాన్నగారు ప్రమీల ఎంతచెపితే అంత! చదువుకుంటానంటే చదివిస్తానంటారు. ఏం చెయ్యాలనుకుంటే అది చెయ్యమంటారు.

కమల అదోవిధమయిన అమాయికురాలు. తండ్రి చదివిస్తున్నాడు—చదువుకుంటోంది... సంబంధాలు చూస్తున్నాడు-అభ్యంతరం చెప్పటం లేదు. గాలి ఎటువీస్తే అటు ఎగురుతుంది కమల. తన జీవితంగురించి తనెప్పుడూ ఆలోచించుకోదు. అయితే ఆ అమ్మాయికికూడా కొన్ని నమ్మకాలు ఉన్నాయి. తల్లితండ్రులు తన మంచికోసమే ఆలోచిస్తూ వుంటారనీ, తన సుఖంకోసమే పాటుపడుతూ వుంటారనీ నమ్ముతుంది. కమల తండ్రి కూడా అంత పూర్వాచారపరాయణుడు కాదు. ఈ కాలంలో ఆడపిల్లలుకూడా చదువుకోవడం అవసరం-అంచేత చదివిస్తూన్నాడు తన కూతుర్ని. ఆడదానికి త్వరగా పెళ్ళిచెయ్యడంకూడా అవసరమే—అంచేత పెళ్ళికికూడా ప్రయత్నాలు చేస్తున్నాడు. ఏదో, మధ్యతరగతి కుటుంబం వేలకివేలు కట్నాలుపోసి పిల్లలకు పెళ్ళిచేసే తాహతులేదు. "మన ప్రయత్నం మనం చేద్దాం. లేకపోతే ఉద్యోగం చేస్తుంది...దాని అదృష్టం ఎలావుంటే అలా జరుగుతుంది" అనుకుంటూడాయన.

బి. యె. పరీక్షలకి ప్రమీల చాలా కష్టపడి చదివింది—ఫస్టుక్లాసులో పాసవాలని. కమల కూడా కష్టపడే చదివింది—తన భవిష్యత్తు ఎలా ఉంటుందోననే బెదురుతో. శ్యామల ఖుషీగా చదివింది. ఆ పరీక్షలైపోతే తను హాయిగా బ్రతకవచ్చు. ఏవిధమైన మనోవ్యాధిలేకుండా, తన బ్రతుకుబాట ఏదో స్థిరపడిపోయింది. తను ఇక ఆ బాటమీద కళ్ళు మూసుకుని నడిచిపోవచ్చు. తను ఆ పరీక్షలో పాసైపోతే తండ్రి బాధ, తన బాధకూడా ఆ తీరయిపోతుంది—అనుకుంది.

అందరూ అనుకున్నట్లుగానే ప్రమీల ఫస్టు క్లాసులోనూ, కమల సెకండుక్లాసులోనూ, శ్యామల థర్డు క్లాసులోనూ పాసైయూరు. శ్యామల సిగ్గుపడలేదు. తను కోరుకున్నట్లుగానే పాసైంది చాలు ననుకుంది. తనకి వివాహమైపోతుంది. ఇక క్లాసులతో తనకేం పని? నలుగురిలోనూ గొప్పగా చెప్పుకునేందుకు తనకో డిగ్రీ ఉంది. అంతకంటె ఏం కావాలి? ఒక నెల్లాళ్ళుపోతే తనొక గృహిణి!

కమల తండ్రి ఇంక చదువు చెప్పించలేనన్నాడు. సంబంధం ఎక్కడా కుదరలేదు. ఆ కాలేజీ ఆఫీసులోనే వెంటనే టెంపరరీగా

ఉద్యోగం దొరికింది. కమల తన అదృష్టానికి మురిసిపోయింది-ఊరికే ఇంట్లో కూర్చోకుండా కాలక్షేపానికి ఏదో ఉద్యోగం దొరికినందుకు.

ప్రమీల బి. యల్. క్లాసులో చేరింది-ప్లీడరు అవాలనే ఉద్దేశంతో. ప్రమీల ఉత్సాహానికీ, ఆనందానికీ ఆదర్శాలకూ మేరలేదు. క్లాసులో అందరికంటె తెలివైన పిల్ల అనిపించుకుంటోంది.

అకస్మాత్తుగా ఒక రోజున శ్యామల తల్లి తండ్రులకి ఒక గాలి కబురు తెలిసింది. తమ చెవుల్ని తామే నమ్మలేకపోయారు. ఎలా నమ్ముతారు? చదువుకున్న మనిషి...సంస్కారంవున్న తల్లితండ్రులు. ఇంతటి అన్యాయానికి పూనుకుంటారని ఎవరు మాత్రం కలగంటారు? ఆ కొత్త ప్లీడరుకి ఇంకెవరో అయిదువేల కట్నంతో ఒక మోటారు కారు, ఆడబడుచులుకీ, వియ్యపురాలికీ వెయ్యినూట పదహార్లు లాంఛనాల క్రింద ఇస్తానన్నారుట. పిల్ల అంత పెద్ద చదువులు చదువుకోలేదుటగానీ, పని పాటలు చక్కగా చేతనవునట. చూట్టానికి బాగానేవుంటుందిట-బొద్దుగా. వాళ్లు ఆ సంబంధానికి ఒప్పుకున్నారట. ముహూర్తానికింకా వారం రోజులు గడువుందిట. "అయితే, మా అమ్మాయి మాటేమిటి? మేం మాత్రం ముహూర్తం పెట్టలేదూ? మంచి బలమైన ముహూర్తం కదా అని శ్రావణంలో పెట్టాను. ఈలోగానే ఇంత అన్యాయం చేసి, మమ్మల్ని అపదిష్టపాలు చెయ్యాలా? అన్నాడు శ్యామల తండ్రి ఆ కబురు తెచ్చిన మనిషితో. "ఏముంది చెయ్యడానికి? అమ్మాయికి ఇంకెక్కడైనా సంబంధం చూడాలి మరి. ఇప్పుడు పెళ్లి వాళ్లతో తగువు పెట్టుకుంటారా-లేకపోతే కోర్టుకెడతారా" అన్నాడా పెద్దమనిషి. శ్యామల గోడ చాటునుంచి ఆ మాటలు విని గదిలో మంచంమీద బోర్లాపడి వెక్కి వెక్కి ఏడ్చింది. తల్లి కూడా కంట నీరు పెట్టుకుంటూ కూతుర్ని ఓదార్చింది.

ఈ గాలి కబురు ప్రమీలకీ, కమలకీ కూడా అందింది. వాళ్లిద్దరూ శ్యామలని పరామర్శ చెయ్యడానికి వచ్చారు. వాళ్ళ ఎదుట తల ఎత్తి మాట్లాడలేకపోయింది శ్యామల. తన కటువంటి పరాభవం అవుతుందని కలలో కూడా ఊహించలేకపోయింది. ప్రమీలకంటె, కమలకంటె తనే అదృష్టవంతురాలినని మురిసిపోయింది. అంత గర్వపడ్డందుకు భగవంతుడు తనకు తగిన శాస్తి చేశాడనుకుని లోలోపల కుమిలిపోయింది. ప్రమీల ఓదార్చడానికి బదులు దెప్పి పొడిచింది. "నేను ఆ రోజునే అడిగాను నిన్ను "నీకిప్పుడు పెళ్లికి తొందరేం వచ్చింద"ని. నా మాట విన్నావా? ఆ చదువుకున్న కుఱువుకి డబ్బు ప్రధానంకాని నువ్వు ప్రధానం కాదని నే నప్పుడే అనుకున్నాను. సంసారంలో ఏదో సుఖాన్ని పొందుదామని ఉవ్విళ్లూరిపోయావుగా!" అంది ప్రమీల. పుండుమీద కారం జల్లినట్లయింది శ్యామలకి. "కళ్ళనీళ్ళు పెడితే లాభం ఏముంది శ్యామలా? అయినా నీ కిప్పుడొచ్చిన నష్టం ఏమిటి? హాయిగా నెక్స్టు ఇయర్ కాలేజీలో చేరి ఎమ్. ఏ. చదువుదుగాని నీ పెళ్ళికి కట్నంక్రింద ఇవ్వదలచుకున్న డబ్బుతో నిన్ను చదివించమని చెప్పు మీ నాన్నగారితో" అంది కమల పెద్దమనిషి తరహాగా. "మొత్తం మీద రెంటికినీ చెడ్డ రేవడిలా అయింది నా బ్రతుకు" అనుకుంది శ్యామల.

శ్యామల ఆ ఏడంతా ఏడుస్తూనే గడిపింది- "ఇటు చదువూ చెడింది-అటు పెళ్ళి కాలేదు." అనుకుంటూ. అయితే శ్యామల జాతకంగొప్పది. మధ్యమధ్య మనసు కలతచెందే సంఘటనలు జరిగినా, శ్యామల జీవితంలో అదృష్టానికి స్థానం లేకపోలేదు. శ్యామల అన్నయ్య ఒక సంబంధం తీసుకొచ్చాడు. ఆ అబ్బాయి, శ్యామల అన్నయ్య కలిసి చదువుకున్నారుట. కట్నం పుచ్చుకోడుట. కుర్రవాడు నల్లగాఉంటాడు. అందగాడు మాత్రం కాదనేచెప్పాలి. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. నెలకి నాలుగొందలు సంపాదించుకుంటున్నాడు. గుణం మంచిది. శ్యామల వెంటనే ఒప్పుకుంది పెళ్లికి. ఈసారి ఆలస్యం చెయ్యకుండా వెంటనే వివాహం జరిగిపోయింది.

శ్యామల భర్తతో కలిసి బెజవాడ వెళ్ళిపోయినది. వెళ్ళగానే తన నూతన జీవితాన్ని వర్ణిస్తూ ప్రమీలకూ,కమలకూ ఉత్తరాలు రాసింది. తన భర్తకి తనంటే ఎంతో అభిమానం అనీ, తనని పువ్వుల్లోపెట్టి ప్రేమిస్తున్నాడనీ, బ్రతుకెంతో హాయిగా వున్నట్లు తోస్తున్నదనీవ్రాసింది. ఉత్తరానికి జవాబు వ్రాయడానికి కూడా తీరుబడి

లేనంతగా చదువుతోంది ప్రమీల. ప్రతినిత్యం ఏదో టెక్స్టుబుక్ చదువుతూనేవుంటుంది. ఇక ఆ యేటితో ప్రమీలచదువు పూర్తిఅవుతుంది. ఇక తను ప్రాక్టీసు పెట్టవచ్చు. తీయనికలలు కంటోంది ప్రమీల తన స్వతంత్రజీవితాన్ని గూర్చి. అయితే, దేనికైనా అదృష్టం కలిసి రావాలి. అంతకష్టపడి రాత్రింపగళ్ళు చదివి నందుకుగాను ఫలికంగా ప్రమీల ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. సరిగ్గా పరిక్షలముందు జబ్బుపడింది...దగ్గు...జ్వరం...అంతా హడిలి పోయారు. క్షయలోకి దింపుతుందేమోనని. ఆ యేడు పరీక్షలకి హాజరవలేదు. "విశ్రాంతి తీసు కుంటే ఏమీ అపాయం ఉండదు. అంతా తగ్గి పోతుంది" అని సలహా ఇచ్చాడు డాక్టరు. ఇక, ప్రమీల గాలిమేడలన్నీ కూలిపోయినట్లు, తన తనజీవితమంతానిరాశమయం అయినట్లు ఫీలైంది. విశ్రాంతిలో బద్ధకం అలవరచుకుంది. చదువుగా మునుపటి ఆసక్తిగాని, పట్టుదలగానిలేదు.ఏదో,చద వాలికాబట్టి చదివింది.ఎలాగోచచ్చిచెడి పాసైంది. ప్రాక్టీస్ పెట్టాలనే వెనకటి ఉత్సాహం అంతా ఏనాడో నశించింది. అయితే ఏంచేయడం?... చదువుకున్న దెందుకు? ఊరికే ఇంట్లో నలుగురి తోనూ కబుర్లుచెప్తూ కూర్చోవడానికా?...మళ్ళీ ఆలోచించింది...ఒక ప్లీడరుదగ్గర ఎప్రెంటిస్‌గా చేరింది. అయినా ఇప్పటి ప్రమీల వెనకటి ప్రమీల కాదు. వెనకటి తెలివితేటలు, చురుకు తనం, కొంటెతనం అన్నీ క్రమంగా నశించినయ్. బుర్ర ఉపయోగించకుండా పనిచేస్తోంది. పూర్వం కొంటెగా, మొండిగా అందరితో వాదించేది. తీరా సీరియస్‌గా వాదించవలసిన సమయంవచ్చే సరికి బుర్ర పనిచెయ్యడం మానేసింది. ఒకటిరెండు చిన్నకేసుల్లోకూడా వాదించలేక ఓడిపోయింది. తన జీవితంలో ఏదో లోపించినట్లు తోచి, అదేదో తెలుసుకోవడానికి ప్రయత్నించసాగింది. తన జీవితాన్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నించడం ప్రారంభించింది. ఏమిటి తను జీవితంలో సాధించ బోయేది? తను ఏ సుఖాన్ని కోరింది? ఆ సుఖం తనకు లభిస్తుందా? తను కోరిన స్వతంత్రం తనకి లభించిందా... లభిస్తుందా?... ఈ జీవితానికి అంతె క్కడ? ఎన్నాళ్లు ఇటువంటి జీవితాన్ని గడపడం? అమ్మ, నాన్నపోయాక తనకి స్థానం ఎక్కడ? ఒంటరిగా ఉండాలనే ఆలోచన వచ్చేసరికి మొట్ట మొదటిసారిగా ప్రమీల భయంతో కంపించి పోయింది. ప్రమీల బుర్రలో ఆలోచనలు పరం పరలుగా వస్తున్నాయి... తనచుట్టూవున్న పరిస రాలూ, పరిస్థితులూ ఇప్పుడిప్పుడే అర్థమవు తున్నాయి.

ఏంతోచక ఓసారి కమల ఇంటికి వెళ్లింది. కమలని చూసి చాలారోజులైంది. కమలలో చాలా మార్పు వచ్చింది. కమల మునుపటికంటె బలంగా ఉత్సాహంగా వుంది. అనాలోచితంగా వాళ్లగదిలో ఉన్న నిలువుటద్దంలో ప్రమీల తన ప్రతిబింబాన్ని చూసుకుంది. అద్దంలో తన అస్థి పంజరం కనిపించింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. కమల గుచ్చిగుచ్చి అడిగింది. ప్రమీల అలాఅయి పోవడానికి కారణం ఏమిటని. తనకే తెలియదు. కమలకేం చెబుతుంది? శ్యామల దగ్గరనుంచి కమలకి ఉత్తరాలు వస్తున్నాయనీ, శ్యామల కామధ్య ఒక ఆడపిల్లపుట్టిందనీ తెలుసుకుంది ప్రమీల. అన్నిటికన్నా ముల్లులా గుచ్చుకుని ప్రమీలను బాధపెట్టినది—కమలకి సంబంధం నిశ్చయమయిందన్న సంగతి.

ప్రమీలలో పట్టుదలహెచ్చింది. బలానికి మందుపుచ్చుకోవడం, శరీరాన్ని సంరక్షించు కోవడం, మొదలెట్టింది. కోల్పోయిన శక్తినీ, ఉత్సాహాన్నీ తిరిగి సంపాదించుకోవడానికి ప్రయత్నించింది. ప్రమీలదృష్టిమారింది. అయితే, వెనకటి పరిస్థితులూ మారినై. తల్లీ, తండ్రీ తన వివాహప్రసక్తి తేవటం మానేశారు. వాళ్లు చెప్పి చెప్పి విసిగిపోయారు. వాళ్లడిగినన్నాళ్ళూ 'పెళ్ళి' అనేసరికి చీదరించుకుంది. ఇప్పుడు స్వయంగా "అమ్మా, నాకు పెళ్ళికావాలి...నాన్నగారూ, నాకుపెళ్ళిచెయ్యండి" అని అడగడానికి ఆత్మాభి మానం అడ్డువచ్చింది. "ఏ ముఖం పెట్టుకుని అడగను?" అని తనలోతాను ప్రశ్నించుకుంది. ఏమయినా పట్టుదలమాత్రం వదలలేదు. పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంది. తన మనసువిప్పి చెప్పుకోవాలంటే వినే మనుషులే కనిపించలేదు. కమలతో ఎందుకో మాట్లాడ బుద్ధి పుట్టడంలేదు. శ్యామలకు ఉత్తరం

రాయాలనిపించదు. ఇంకెవ రున్నారు తనకీ ప్రపంచంలో? ఇంట్లో అమ్మ, నాన్న ముభావంగా వుంటారు. ఇక రోజంతా ఆ ప్లీడరుగారింట్లోనే గడుపుతోంది. ఆయన మంచివాడే. ఎంతో ఆదరంగా, చనువుగా మాట్లాడతాడు. ఆయన భార్య కూడా మంచిదే. చదువుకున్నది కాకపోయినా సభ్యత తెలుసును. ఎంతో సరదాగా కూడా ఉంటుంది. వాళ్ళ పిల్లలు ముగ్గురు ఉన్నారు. పెద్దవాడికి పదేళ్లు ఉంటాయి. ఆ తర్వాత అమ్మాయి-ఏడేళ్ళది. మరో ఆడపిల్ల-నాలుగేళ్ళది. వాళ్లు ముగ్గురూ కూడా ముచ్చటగా ఉంటారు. కాలక్షేపానికి ప్రమీల వాళ్ళతో ఆడుతూ వుంటుంది. ఉదయం మొదలుకుని చీకటి పడేవరకూ ప్లీడరుగారింట్లోనే గడుపుతోంది-మధ్యమధ్య కోర్టుకి వెళ్లడంతప్ప.

కమల పెళ్లి చూట్టానికి శ్యామల బెజవాడ నుంచి వచ్చింది. పెళ్లింకా రెండురోజులుందనగానే వచ్చింది పుట్టింటికి. ఇంటికివెళ్ళి స్నానం భోజనం చెయ్యగానే ,పిల్లని తల్లి చేతికిచ్చి తను కమల ఇంటికి బయలుదేరింది. వెళ్లేటప్పటికి కమల పిండి జల్లిస్తోంది. "ఏఁవిటి కమలా, నీ పెళ్లిపనులు నువ్వే చేసుకుంటున్నావేఁవిటి? నువ్వు నాకు ఉత్తరంరాసి ఎన్నాళ్ళయిందో గుర్తుందా?" అంది శ్యామల నవ్వుతూ. "ఉత్తరం రాసి నెల్లాళ్లు పైన అవుతుంది. ఏఁవిటో, బద్ధకించాను-అని సమాధానము చెప్పుకుంది కమల. ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు స్నేహితులిద్దరూ. మాటల సందర్భములో "ప్రమీల ఊళ్ళోనేవుందా? చదువుకుంటున్నదని ఎంతగర్వం బలిసిందో... ఉత్తరంరాస్తే జవాబైనా రాయలేదు" అంది శ్యామల. "అన్నట్లు మరిచిపోయాను శ్యామలా... చెప్పడం... ప్రమీల ఊళ్ళోనే ఉంది... చదువుకున్నందుకు గర్వం బలిసిందనుకున్నావుగాని...పాపం, అదేం కాదు... ప్రమీల పూర్తిగా మారిపోయింది. మాయింటికి క్రిందటిసారి వచ్చినప్పుడు చూస్తే జాలేసింది. ఎంత చిక్కిపోయిందనుకున్నావ్! ఉత్తి ఎముకలపోగు. నాకు సంబంధం కుదిరిందనగానే చిన్నబుచ్చుకుంది. నాతో మనసు విప్పి మాట్లాడలేక వెంటనే వెళ్లిపోయింది...నేనిదివరకు ఒకసారి నీకు రాశాను...ఒక ప్లీడరుగారి దగ్గర ఎప్రెంటిస్‌గా ఉందని...జ్ఞాపకంలేదూ? ఆయనకి నలభై ఏళ్ళుంటాయి...ముగ్గురు పిల్లలు, భార్య పురిటికి వెళ్ళగా చూసి ప్రమీల, ఆ ప్లీడరూ పెళ్ళి చేసుకున్నారు...ప్రమీల తల్లీ, తండ్రీ కొడుకు దగ్గిరికి వెళ్ళిపోయారు ఇక్కడ ఇల్లు అమ్మేసి. ప్రమీల ఊళ్ళోనే ఉంది. కాని రావడం మానేసింది. పెళ్లి చేసుకుందని విన్నాక నేనింకా వెళ్ళలేదు చూట్టానికి" అన్నది కమల.

---

# మాతృగీతిక

బైరాగి

చీకటిపడినది తల్లీ! దీపం
చూపవేలనే?
మాకై దీపం చూపవేలనే?

ఆటలపాటల ప్రొద్దు బుచ్చినవి
పిట్టలు గూటికి తిరిగి వచ్చినవి
రెక్కలార్చి పవలెల్ల నొచ్చినవి
సంజమసక నిను దరియ వచ్చితిమి
కోపమేలనే?
మాకై దీపం చూపవేలనే?

పాపపుణ్యములు పరచిన బాటల
కూడని వేడుక కూడినచోటుల
పయినించాం మా పసి చెలగాటల
మలినదేహులము, చల్లని చేతుల
చాపవేలనే?
మాకై దీపం చూపవేలనే?

నీ గొంతుక వినిపించని గేహం,
మా మదిలో దుర్భర సందేహం,
దీపికగా వెలిగే నీ స్నేహం
ఈ దోబూచుల పెనుచీకటిలో
దాపనేలనే?
మాపై కోపం చూపనేలనే?

తల్లీ! దీపం చూపవేలనే?